


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

| | |
|---|---|
| బంగారం ధర 10 GRMS 24 CARAT | ₹63,000 |
| వెండి ధర 1KG | 76,000 |
| సెన్సెక్స్ (423) | 72,154 |
| నిఫ్టి (142) | 21,913 |
| చికెన్ ధర 1KG | ₹ 220 |
| గుడ్ల ధరలు డజన్ | ₹68 |

## వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ అలెన్‌పై నిలువు దోపిడీ

దక్షిణాఫ్రికాలో ఉన్న వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఫాబియన్ అలెన్‌కు చేదు అనుభవం ఎదురైంది. సౌతాఫ్రికా టీ20 లీగ్ 2024లో అలెన్ పార్ల్ రాయల్స్ తరపున ఆడుతున్నాడు. ఈ క్రమంలో జోహన్స్‌బర్గ్‌లో జట్టు బసచేస్తున్న శాండ్‌టన్ సన్ హోటల్ సమీపంలో అలెన్‌ను కొంతమంది దుండగలు తుపాకితో బెదరించి తన ఫోన్‌ను, వ్యక్తిగత వస్తువులను ఎత్తుకుపోయారు. ఈ ఘటనతో ఫాబియన్ అలెన్ ఒక్క సారిగా భయభ్రాంతులకు గురైనట్లు విండీస్ క్రికెట్ బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఈ విషయం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక అంతర్జాతీయ క్రికెటర్‌కు కనీస భద్రత లేకపోవడం పట్ల క్రికెట్ సౌతాఫ్రికాపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. "మా జట్టు ప్రధాన కోచ్ ఆండ్రీ కోలీ ఫాబియన్‌తో ఇప్పటికే మాట్లాడాడు. మరో విండీస్ క్రికెటర్ ఒబెడ్ మెక్‌కాయ్ కూడా ప్రస్తుతం సౌతాఫ్రికాలోనే ఉన్నాడు. ఈ క్రమంలో మెక్‌కాయ్‌ను ఆండ్రీ కోలీ కాంటాక్ట్ అయ్యాడు. ప్రస్తుతం అలెన్ బాగానే ఉన్నాడు. కానీ ఈ ఘటనపై సౌతాఫ్రికా క్రికెట్, పార్ల్ రాయల్స్ ఇంకా స్పందించాల్సి ఉందని" విండీస్ క్రికెట్ సీనియర్ అధికారి ఒకరు క్రిక్‌బజ్‌తో పేర్కొన్నారు.



## బ్రిటన్ రాజు ఛార్లెస్-3కి క్యాన్సర్..

బ్రిటన్ రాజు ఛార్లెస్-3కి క్యాన్సర్ నిర్ధారణ అయిందని బకింగ్‌హాం ప్యాలెస్ వెల్లడించింది. అయితే అది ప్రొస్టేట్ క్యాన్సర్ కాదని, ఇటీవల పెరిగిన ప్రొస్టేట్‌కు చికిత్స సందర్భంగా వ్యాధి బయటపడిందని తెలిపింది. అది ఏ రకమైన క్యాన్సరనేది అధికారికంగా వెల్లడి కాలేదు. ఆయన సోమవారం నుంచి చికిత్స తీసుకుంటున్నారని ప్యాలెస్ వివరించింది. చికిత్స పూర్తి చేసుకుని త్వరలోనే ఆయన సాధారణ విధుల్లోకి వస్తారని పేర్కొంది. ప్రస్తుతానికి ఆయన హాజరయ్యే కార్యక్రమాలకు రాజ కుటుంబంలోని సీనియర్లు వెళ్తారని వెల్లడించింది. 75ఏళ్ల ఛార్లెస్-3 గత ఏడాదే బ్రిటన్ రాజుగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.



## హెచ్-4 వీసాదారులకు ఆటోమేటిక్‌గా ఉద్యోగ అనుమతులు

హెచ్-4 వీసాదారులకు శుభవార్త! అమెరికాలో వారికి ఉపాధి దొరకడం ఇకపై సులువుకానుంది. సంబంధిత కీలక బిల్లును సెనెట్ త్వరలోనే ఆమోదించనుంది. దీనివల్ల సుమారు లక్ష మందికి లబ్ధి కలగనుంది. హెచ్-1బి వీసా దారుల జీవిత భాగస్వాములు, వారి పిల్లలకు (21 ఏళ్లలోపు వయసున్నవారు) హెచ్-4 వీసాలు జారీ చేస్తుంటారు. హెచ్-4 వీసాదారులు అమెరికాలో ఉద్యోగం చేయాలంటే తప్పనిసరిగా ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్, ఐ-765 కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ ప్రక్రియ పూర్తయి అనుమతులు వచ్చేందుకు ఏడాది వరకూ సమయం పడుతుంటుంది. దానివల్ల వారు పలు ఉద్యోగావకాశాలు కోల్పోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిబంధనలను మార్చి.. హెచ్-4 వీసాదారులకు



ఆటోమేటిక్‌గా ఉద్యోగ అనుమతులు మంజూరయ్యేలా రూపొందించిన బిల్లుకు త్వరలోనే ఆమోదం లభించనున్నట్లు శ్వేతసౌధం ఆదివారం వెల్లడించింది.



## టెస్టుల్లో 31వ సెంచరీ..

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో కేన్ విలియమ్సన్ శతకాల మోత మోగిస్తున్నాడు. మంచినీళ్లు తాగినంత సులువుగా మూడంకెల స్కోర్ చేస్తూ రికార్డులు బద్ధలు కొడుతున్నాడు. బే ఓవల్‌లో జరుగుతున్న మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ బాదిన విలియమ్సన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ వంద కొట్టాడు. సఫారీ కుర్ర పేస్ దళాన్ని చీల్చిచెండాడుతూ 132 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 109 రన్స్ బాదాడు. తద్వారా ఈ స్టార్ ఆటగాడు సుదీర్ఘ ఫార్మాట్‌లో 31వ సెంచరీ నమోదు చేశాడు. దాంతో, టెస్టుల్లో అత్యధిక సార్లు మూడంకెల స్కోర్ సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ తో పాటు ఫ్యాబ్ 4లో ఉన్న విరాట్ కోహ్లీ రికార్డును బ్రేక్ చేసిన విలియమ్సన్.. ఇప్పుడు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ రికార్డును బ్రేక్ చేశాడు. మరొక సెంచరీ కొడితే ఈ కివీస్ మాజీ సారథి ..ఆస్ట్రేలియా రన్ మెషిన్ స్టీవ్ స్మిత్ సరసన నిలుస్తాడు. ప్రస్తుతం స్మిత్ 32 శతకాలతో టాప్‌లో కొనసాగుతున్నాడు.

## టైటిల్ వెనక్కి ఇచ్చేసిన మిస్ జపాన్



ఈ ఏడాది మిస్ జపాన్ టైటిల్‌ను గెలిచిన కరోలినా సంచలన నిర్ణయం తీసుకుంది. తన టైటిల్‌ను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు కరోలినా ప్రకటించింది. అందాల పోటీల్లో జడ్జిగా వ్యవహరించిన ఓ డాక్టర్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు తెలిసింది. పెళ్లైన వ్యక్తితో రిలేషన్‌లో ఉన్న ఆమెపై విమర్శలు వచ్చాయి. దీంతో కరోలినా తన అందాల టైటిల్‌ను వదిలేసుకున్నది.



## మూడు నెలల తర్వాత తెలంగాణ భవన్‌కు కేసీఆర్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు నేడు తెలంగాణ భవన్ కు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ రాష్ట్ర సమితి ఓడిపోయి అధికారం కోల్పోయిన తర్వాత కేసీఆర్ తొలిసారిగా పార్టీ కార్యాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత అప్పటి ప్రగతి భవన్ నుంచి ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైన కేసీఆర్ అనుకోకుండా ప్రమాదానికి గురయ్యారు. శస్త్రచికిత్స తర్వాత ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నారు. దాదాపు రెండు నెలలుగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న ఆయన ఇటీవల రాజకీయంగా క్రియాశీలకంగా మారారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి అసెంబ్లీకి చేరుకున్న ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎదుట ప్రమాణం చేశారు. చాలా రోజుల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చారు. కృష్ణా నది నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించడంపై ఇటీవల వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో కృష్ణా పరివాహక ప్రాంతాల బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు. ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను కేంద్రానికి అప్పగించడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ... కాంగ్రెస్ రైతు వ్యతిరేక



విధానాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధమైంది. కృష్ణా నదిపై ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ త్వరలో నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ భేటీ నిర్వహణపై కూడా కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించనున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కృష్ణా నది సమస్యను ఉపయోగించు



కోవాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ కూడా రాజకీయంగా యాక్టివ్‌గా మారడంతో ఇప్పుడు కాంగ్రెస్‌పై ఎదురుదాడికి బీఆర్ఎస్ సిద్ధమైంది. అందులో భాగంగానే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు.

## అయేషా శర్మ హాట్ ట్రీట్

చిరుత హీరోయిన్ నేహా శర్మ సోదరి ఆయేషా శర్మ తెలుగులో సినిమాలు చేయలేదు కానీ హిందీలో పలు సినిమాల్లో భాగమైంది. ఆమెకు స్టార్ క్రేజ్ రాకపోయినా సోషల్ మీడియాలో ఆమె చేసే హడావిడి అంతా ఇంతా కాదు. తాజాగా ఆమె కొన్ని హాట్ ఫోటోలను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది చూసేయండి.చిరుత సినిమాతో టాలీవుడ్ లో హీరోయిన్ గా పరిచయమైన నేహా శర్మ సోదరి ఆమె బాటలోని హీరోయిన్ గా మారి మెరిసిపోవాలని సినీ రంగ ప్రవేశం చేసింది. అయితే ఇప్పటివరకు ఆమెకు బాలీవుడ్ లో ఒకే ఒక సినిమా అవకాశం దక్కింది. 2018 వ సంవత్సరంలో విడుదలైన సత్యమేవ జయతే అనే సినిమాలో ఆమె హీరోయిన్ గా నటించింది. కానీ ఆ తర్వాత ఆమెకు ఒక్క సినిమా అవకాశం కూడా దక్కలేదు. అయితే గ్లామర్ ఫీల్డ్ లో ఎంట్రీ ఇచ్చిన తర్వాత వెనకడుగు వేయకూడదు అనుకుందో ఏమో తెలియదు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు మీరు చూసేయండి మరి. ఈ ఫోటోలలో ఆమె బ్లాక్ కలర్ టాప్ లో కనిపిస్తూ ఉండగా పూర్తిస్థాయిలో ఎద అందాలు కనిపించే విధంగా ఆమె రెచ్చిపోయింది.



## నేటి నుంచి మార్కెట్‌లోకి భారత్ రైస్




కేంద్ర ప్రభుత్వం బియ్యం ధరల తగ్గింపునకు శ్రీకారం చుట్టి, సామాన్య ప్రజలకు ఊరట కలిగించింది. మంగళవారం (ఫిబ్రవరి 6) సాయంత్రం 4 గంటలకు భారత్ రైస్‌ను ప్రభుత్వం మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ఈ బియ్యాన్ని కిలో రూ.29కి విక్రయించనున్నారు. బియ్యం ధరల తగ్గింపునకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, దేశీయ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలలో గణనీయమైన తగ్గింపు లేదు. నిత్యావసరాల ధరలు ప్రస్తుతం 14.5 శాతం మేరకు పెరిగాయి. భారత్ రైస్ నేటి నుంచి ఎన్ఏఎఫ్ఈడీ, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్‌తో సహా అన్ని చైన్ రిటైల్‌లలో అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కిలో రూ.29కి లభ్యమయ్యే భారత్ రైస్ 5 కిలోలు, 10 కిలోల బస్తాలలో లభించనుంది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం తొలుత భారత్ బ్రాండ్ కింద తక్కువ ధరకు గోధుమ పిండి, పప్పులు, ఉల్లిపాయలు, టమోటాల విక్రయాలను ప్రారంభించింది. 'భారత్ ఆటా'ను 2023, నవంబరు 6న ప్రభుత్వం మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది బయటి మార్కెట్‌లో కిలో రూ. 35 ఉండగా, ప్రభుత్వం రూ.27.50కే అందిస్తోంది. అదే సమయంలో పప్పులు కిలో రూ.60కి అందుబాటులోకి వచ్చాయి.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో విచారణ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు విచారణ మొదలైంది. ఎస్సీ వర్గీకరణపై దాఖలైన అన్ని పిటిషన్లను జత చేసిన సుప్రీంకోర్టు.. పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన ఫిర్యాదుగా స్వీకరించి మంగళవారం విచారణ చేపట్టింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు రాజ్యాంగం అనుమతిస్తుందా? లేదా? వేచి చూడాలి. వాదనలు కొనసాగుతున్నాయి.



## నేడు ఉత్తరాఖండ్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు

దేశంలో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేస్తున్న మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించనుంది. యూసీసీపై బిల్లును తీసుకురావడానికి ఉత్తరాఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ రోజు (మంగళవారం) రెండవ రోజున అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. పోర్చుగీస్ పాలనా కాలం నుండి గోవాలో యూసీసీ అమలులో ఉంది. యూసీసీ కింద వివాహం, విడాకులు, భరణం, భూమి, ఆస్తి, వారసత్వానికి సంబంధించిన చట్టాలు రాష్ట్రంలోని పౌరులందరికీ వారి మతంతో సంబంధం లేకుండా వర్తిస్తాయి. మంగళవారం సభలో ఈ బిల్లుపై చర్చ జరగనుంది. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు చర్చల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కోరారు. యూసీసీ గురించి ఇటీవల మాట్లాడిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దీనివలన అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. బిల్లుపై సభలో సానుకూలంగా చర్చించాలని ఇతర పార్టీల సభ్యులను అభ్యర్థించారు. ఆదివారం రాష్ట్ర మంత్రివర్గం యూసీసీ ముసాయిదాను ఆమోదించి, ఫిబ్రవరి 6న బిల్లుగా సభలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. నాలుగు సంపుటాలలో 740 పేజీలతో కూడిన ఈ ముసాయిదాను సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ శుక్రవారం ముఖ్యమంత్రికి సమర్పించింది. 2022లో జరిగిన ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో




యూసీసీపై చట్టం చేసి, రాష్ట్రంలో దానిని అమలు చేస్తామని బీజేపీ హామీనిచ్చింది. 2000లో ఏర్పడిన ఉత్తరాఖండ్‌లో వరుసగా రెండోసారి బీజేపీ అధికారాన్ని దక్కించుకుంది. 2022 మార్చిలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో యూసీసీ అమలుపై హామీనిచ్చింది. కాగా మంగళవారం అసెంబ్లీలో యూసీసీపై చర్చ జరగనున్న సందర్భంగా అవాంఛనీయ పరిస్థితులు చోటు చేసుకుంటే, వాటిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు సమాచారం.



## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్.. కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇక, పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ కాంగ్రెస్‌లో చేరారు. వివరాల ప్రకారం.. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్‌లో చేరిపోయారు. తాజాగా ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి ఎంపీ వెంకటేష్ వెళ్లారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్.. వెంకటేష్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతం పలికారు. కాగా, ఎంపీ వెంకటేష్ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. తాజాగా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి మళ్లీ హస్తం గూటికి చేరారు. ఇక, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్టు సమాచారం. ఇక, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. అయితే, లోక్‌సభ ఎన్నికల వేళ సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడం బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ అని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

### ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అసభ్య పదజాలం ఉపయోగించిన సీఎంపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ విషయంపై తాము కోర్టుకు వెళ్తామని చెప్పారు. తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు పెట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని కవిత అన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాటించిన విధానాలనే నేడు తెలంగాణలో ఉన్న ఢిల్లీ రిమోట్ కంట్రోల్ పాలన అవలంబిస్తోందన్నారు. ఇది రాచరిక వ్యవస్థను తలపిస్తోందని విమర్శించారు.



## ఏపీ అసెంబ్లీ ముట్టడికి సర్పంచుల యత్నం.. పోలీసుల లాఠీఛార్జి


ఏపీ అసెంబ్లీ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడికి సర్పంచులు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చారు. పోలీసుల కళ్లుగప్పి అసెంబ్లీ పరిసరాల వరకూ సర్పంచులు వచ్చారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దారిమళ్లించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ నిధులను సర్పంచుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ నిధులను చట్టప్రకారం పంచాయతీలకు ఇవ్వాలని కోరారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. లాఠీలతో కొడుతూ ఈడ్చుకెళ్లి బస్సుల్లో పడేశారు. ఈ ఘటనలో పలువురు సర్పంచులకు తీవ్ర గాయాలయ్యాయి. అంతకుముందు పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సర్పంచుల చలో అసెంబ్లీకి వెళ్లకుండా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను ఉయ్యూరులో పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రతినిధులను మందడంలో అరెస్ట్ చేసి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కానిస్టేబుల్‌ను వాహనంతో ఢీకొట్టి చంపిన ఎర్రచందనం స్మగ్లర్లు

అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు ఘాతుకానికి పాల్పడ్డారు. కానిస్టేబుల్‌ను వాహనంతో ఢీకొట్టి చంపారు. సోమవారం రాత్రి తనిఖీలు చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేవీపల్లి మండలం చీనెపల్లె వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో సుండుపల్లి సరిహద్దు గొల్లపల్లి చెరువు వద్ద సిబ్బంది కాపు కాశారు. ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని కానిస్టేబుల్ గణేశ్ ఆపేందుకు యత్నించాడు. తప్పించుకునే క్రమంలో స్మగ్లర్లు అతడిని వాహనంతో ఢీకొట్టి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను పీలేరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. పోలీసులు గాలింపు చేపట్టి.. ఎర్రచందనం వాహనంతో సహా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

## విషాదంగా మారిన వివాదం.. తల్లి కోపానికి ఇద్దరు పిల్లలు బలి

కుటుంబంలో రేగిన కలతలు చివరకు రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్నాయి పల్నాడు జిల్లాలో ఓ కుటుంబంలో రేగిన వివాదం విషాదంగా మారింది. మాచర్ల మండలం నారాయణపురం తండాలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు కన్న తల్లి కోపానికి బలైయ్యారు. కుటుంబ కలహాలతో కన్నతల్లి, తన ముగ్గురు పిల్లలకు, భర్తకు కూడా టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే ఈ ఘటనలో చికిత్స పొందుతూ ఇప్పటి వరకు ఇద్దరు పిల్లలు మృతి చెందారు. భార్యాభర్తలు మరో బిడ్డతో కలిసి మృత్యువుతో పోరాడుతున్నారు. మరో ముగ్గురు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు.మాచర్ల మండలం నారాయణపురం తండా చెందిన రవి నాయక్, తన అక్క కూతురినే పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం.. కాగావృత్తి రీత్యా రవి నాయక్ హైదరాబాద్‌లో ఆటో నడుపుతున్నారని, వారానికో, పది రోజులకు, వచ్చి కుటుంబంతో గడిపే వారిని సమాచారం. ఈ నేపథ్యంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తాను పుట్టింటికి వెళ్తానని చెప్పింది భార్య వసంత. దీన్ని వ్యతిరేకించాడు భర్త రవి నాయక్. దీంతో భర్తతో తీవ్రవాగ్వదానికి దిగింది వసంత. ఆగ్రహం తట్టుకోలేక తాగుతున్న టీలో ఎలుకల మందు కలిపించింది. ఈ ఘటనలో అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. కాగా టీ రుచిలో తేడా రావటంతో టీ తాగిన రవి నాయక్ ఆ టీని పక్కన పడేశాడు. దీంతో రవి నాయక్‌కు ప్రస్తుతం ప్రమాదం తప్పినట్లేనని డాక్టర్లు చెప్పారు.అయితే కన్నతల్లి కోపంతో టీలో ఎలుకల మందు కలిపించిందన్న విషయాన్ని తెలుసుకోలేని ఆ చిన్నారులు టీని సేవించడం, ఆ తర్వాత తీవ్రమైనటువంటి అనారోగ్యంతో హాస్పిటల్లో చేరటం అక్కడ ఒక్కొక్కరుగా చికిత్స పొందుతూ మృత్యువాత పట్టడం జరిగింది. ప్రస్తుతానికి ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు రమావత్ భాను ప్రకాష్, రమావత్ ఈశ్వర్‌లు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటన జరిగిన గంటల వ్యవధిలో రెండేళ్ల వయస్సు ఉన్న ఈశ్వర్ మృతిచెందగా, సోమవారం రామావత్ భాను ప్రకాష్‌ను చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో, మిర్యాలగూడ సమీపంలో మృతి చెందినట్లు సమాచారం. భర్త రవి నాయక్ భార్య వసంతతో పాటు మరొక చిన్నారి ఈశ్వర్ నాయక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. క్షణికాలం ఆవేశంతో ఇద్దరు బిడ్డల ఉసురు తీసిన కన్నతల్లి పరిస్థితి కూడా విషమంగానే ఉందని , క్షణికాల కోపంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవటం వల్ల కుటుంబాలను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు మృతుల బంధువులు.




## 25 రోజుల్లో "హను మాన్" వసూళ్ల ప్రభంజనం.!

యంగ్ హీరో తేజ సజ్జ అలాగే అమృత అయ్యర్ తో టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్ లో వచ్చిన లేటెస్ట్ చిత్రం "హను మాన్". మరి అనౌన్స్ చేసినప్పుడే ఈ చిత్రం ఇంపాక్ట్ గట్టిగా ఉంటుంది అని నమ్మిన వారు కొంతమంది ఉన్నారు కానీ ఇప్పుడు అది ఈ రేంజ్ లోకి వెళుతుంది అని బహుశా ఎవరూ ఊహించి ఉండకపోవచ్చు. కొన్ని ఛాలెంజ్ లతోనే ఈ సంక్రాంతి కానుకగా రిలీజ్ అయ్యిన ఈ చిత్రం రిలీజ్ అయ్యిన మేజర్ ప్లేసెస్ భారీ వసూళ్లతో రాణించింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం నెవర్ బిఫోర్ మార్క్ ని అందుకొని అదరగొట్టింది. జస్ట్ 25 రోజుల్లోనే ఏకంగా 300 కోట్ల గ్రాస్ ని వరల్డ్ వైడ్ గా అందుకొని ప్రభంజనం సృష్టించింది. దీనితో తేజ సజ్జ అలాగే దర్శకుడు ప్రశాంత్ వర్మల కెరీర్ లోనే ఇది ఒక బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచి వారి కెరీర్ లో బిగ్ బ్రేక్ ని ఇచ్చిన సినిమాగా మారింది అని చెప్పాలి. ఇక ఈ సినిమా తర్వాత రానున్న "జై హనుమాన్" పై కూడా తారాస్థాయి అంచనాలు ఉన్నాయి. ఇక దాని లెక్క ఎక్కడ నుంచి మొదలై ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే.



## బన్నీ సినిమాలో దీపికా పడుకోణె?

ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె హీరోయిన్ గా నటించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. మరి, దీపికా పడుకోణె, నిజంగానే బన్నీ సరసన నటిస్తే.. ఆ క్రేజే వేరు. కాగా జులాయి, సన్ ఆఫ్ సత్యమూర్తి, మరియు అల వైకుంఠపురములో వంటి సూపర్ హిట్‌ల తర్వాత, అల్లు అర్జున్ – త్రివిక్రమ్ మరోసారి జత కట్టారు. ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా పాన్ వరల్డ్ చిత్రంగా రిలీజ్ కానుంది. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో త్రివిక్రమ్ చాలా కేర్ తీసుకుంటున్నాడు. మొత్తానికి తమ నాలుగో చిత్రాన్ని త్రివిక్రమ్ – బన్నీ చాలా గ్రాండ్ గా ప్లాన్ చేశారు. హారిక & హాసిని క్రియేషన్స్ మరియు గీతా ఆర్ట్స్ కలిసి ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాకి సంగీత దర్శకుడు థమన్ సంగీతం అదించబోతున్నాడు.



## లైంగిక వేధింపులు.. భారత హాకీ ప్లేయర్‌పై పోక్సో కేసు నమోదు!

భారత హాకీ ప్లేయర్, అర్జున అవార్డు గ్రహీత వరుణ్ కుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. వరుణ్ కుమార్ తనపై ఐదేళ్లుగా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పెళ్లి పేరుతో గత ఐదేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని సదరు యువతి ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన 22 ఏళ్ల యువతికి 2019లో ఇన్‌స్టాగ్రామ్‌లో వరుణ్ కుమార్ పరిచయం అయ్యాడు. అప్పుడు ఆమె వయసు 17 ఏళ్లు. బెంగళూరులో హాకీ మ్యాచ్‌ల కోసం వచ్చినప్పుడు వరుణ్ తనను కలిసేవాడని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో శృంగారంలో పాల్గొనేవాడని బాధితురాలు ఫిర్యాదులో తెలిపింది. గత ఐదేళ్లుగా వరుణ్ తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. ప్రస్తుతం తన వయసు 22 ఏళ్లు అని, పెళ్లి ప్రస్తావన తీసుకువస్తే తనకు అలాంటి ఉద్దేశం లేదంటున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. యువతి ఫిర్యాదు మేరకు బెంగళూరులోని జ్ఞాన భారతి పోలీసులు వరుణ్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన వరుణ్ కుమార్.. పంజాబ్‌లోని జలంధర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడిని విచారించేందుకు కర్ణాటక పోలీసులు జలంధర్ వెళ్లారు. అయితే ప్రస్తుతం వరుణ్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం వరుణ్ భారత జాతీయ జట్టులో ఆడుతున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టులో సభ్యుడు కూడా. హాకీ ఇండియా లీగ్‌లో పంజాబ్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

## కేజ్రీవాల్ పర్సనల్ సెక్రటరీ ఇంట్లో ఈడీ తనిఖీలు..

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దగ్గర పని చేస్తున్న పర్సనల్ సెక్రటరీ ఇంట్లో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు చేస్తుంది. సుమారు 10 ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఆమ్ ఆద్మీ పార్టీతో లింకులు ఉన్న ప్రదేశాల్లో నేడు సోదాలు జరుగుతున్నాయి. మనీల్యాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. అయితే, పర్సనల్ సెక్రటరీ బిబవ్ కుమార్‌తో పాటు ఢిల్లీ జల బోర్డు సభ్యుడు శాలాబ్ కుమార్ ఇంట్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## నేడు మార్కెట్‌లోకి వన్‌ప్లస్ 12ఆర్ స్మార్ట్‌ఫోన్

ప్రముఖ ఫోన్ల తయారీ సంస్థ 'వన్‌ప్లస్' మరో కొత్త ఫోన్‌ను నేడు మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. 'వన్‌ప్లస్ 12ఆర్' స్మార్ట్‌ఫోన్ విక్రయాలు మంగళవారం (ఫిబ్రవరి 6) మధ్యాహ్నం 12 గంటలకు ఆరంభం కానున్నాయి. వన్‌ప్లస్ ఇండియా వెబ్‌సైట్ మరియు ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియాలో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై మొదటి రోజున కొన్ని బ్యాంక్ ఆఫర్‌లు మరియు ప్రయోజనాలను అమెజాన్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఐసీఐసీఐ క్రెడిట్ కార్డ్ లేదా వన్ కార్డుని ఉపయోగించి వన్‌ప్లస్ 12ఆర్ స్మార్ట్‌ఫోన్‌ని కొనుగోలు చేస్తే.. రూ.1,000 తగ్గింపు లభిస్తుంది. వన్‌ప్లస్ 12ఆర్ విక్రయం ప్రారంభం తర్వాత 12 గంటలలోపు ఈ స్మార్ట్‌ఫోన్ ఆర్డర్ చేసిన కస్టమర్‌లు ఉచితంగా వన్‌ప్లస్ బడ్స్ జెడ్2 (OnePlus Buds Z2) పొందవచ్చు. వీటి ధర రూ. 4,999హా ఉంది. ఈ ఫోన్ కొనుగోలుపై రూ.2,250 వరకు జియో ప్లస్ ప్రయోజనాలను పొందవచ్చు. రూ.599 పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌పై బిల్లింగ్ సైకిల్‌కు రూ. 150 తగ్గింపు లాంటి ప్రయోజనాలు ఉంటాయి. వన్‌ప్లస్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. వినియోగదారులు వన్‌ప్లస్ ఆడియో కోసం రూ.1,200 మరియు వన్‌ప్లస్ ప్యాడ్ కోసం రూ. 3,000 వరకు కూపన్‌ను కూడా పొందుతారు.వన్‌ప్లస్ 12ఆర్‌లో 6.78 ఇంచెస్ 1.5కే ఎల్‌టీపీఓ అమోలెడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఉంది. ఇది 120 హెర్జ్ రిఫ్రెష్ రేట్‌తో వస్తుంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 8జెన్ 2 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఆక్సిజన్ 14 ఆపరేటింగ్ సిస్టమ్ ఉంటుంది. ఈ ఫోన్‌లో వెనుకవైపు 50 ఎంపీ మెయిన్ కెమెరా, 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా, 2 ఎంపీ మాక్రో లెన్స్ ఉన్నాయి. ఇందులో 16 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు.

